విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 07 జనవరి 2024 8 పేజీలు

డిమాండ్లు నెరవేరే వరకు

నిరసన కొనసాగిస్తాం

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన
- పట్టణంలో ర్యాలీ
- సంఘీభావం తెలిపిన టీడీపీ ఇన్‌చార్జి వేగేశన, జనసేన నేతలు

విశాలాంధ్ర - బాపట్ల : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని ఏపీ మున్సిపల్ కార్మికులు భీష్మించి నినాదాలు చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డులో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష శనివారం కొనసాగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్, కార్యదర్శి జేబీ శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్మికులు ఏఐటీయూసీ జెండాలు చేతపూని మున్సిపల్ కార్యాలయం నుంచి చీలురోడ్డు సెంటర్ మీదగా పాతబస్టాండ్ వరకు డిమాండ్లను నెరవేర్చాలంటూ నినాదాలు చేసుకుంటూ ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ, జనసేన సమన్వయకర్త నామన శ్రీమన్నారాయణ సంఘీభావం తెలిపిన మద్దత్తు ప్రకటించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై కపట ప్రేమ చూపిస్తూ ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకపోవటం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే అంగన్వాడీ కార్యకర్తల పట్ల నిర్లక్ష్యం వ్యక్తం చేసిందని ఇప్పుడు పారిశుధ్య కార్మికులు పట్ల కూడా నిర్లక్ష్యం చూపితే సహించేది లేదన్నారు. మున్సిపల్ మిగతా 2 లో ...

టీడీపీ నేతలకు బాబు..దిశా నిర్దేశం

- సమన్వయంతో ముందుకెళ్లండి
- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి
- జిల్లా నేతలతో సమీక్షించిన టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం కనిగిరిలో జరిగిన రా కదలిరా శంఖారావం సభ అనంతరం రాత్రికి కనిగిరిలోనే చంద్ర బాబు నాయుడు బస చేసిన విషయం విదితమే. అనంతరం ఉమ్మడి జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జిలతో చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ విజయానికి సాను కూల పవనాలు వీస్తున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. వంద రోజుల పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలపై దృష్టి పెట్టి వారితో కలిసి పనిచేయాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకమని, ఈ ఎన్నికల్లో విజయం అత్యంత అవసరమన్నారు. ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవ హరించకూడదని తెలిపారు. ప్రస్తుతం జగన్మో హన్‌రెడ్డి వైఖరి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దానిని క్యాష్ చేసుకోవాలని ఆ వైపుగా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా నష్టం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరిగిందని అన్నారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు కూడా టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ పార్టీని నమ్ముకొని ఇంతకాలం పనిచేసిన నాయకులకు అన్యాయం చేయకూడదన్న ఉద్దేశంతో మీపైనే పూర్తి బాధ్యతలను అప్పగించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో జనసేనతో కలిసి ముందుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉన్నందున సీట్ల విషయంలో చిన్నపాటి మార్పులు జరిగినా ఎవరూ నిరుత్సాహానికి గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ విజయానికి సానుకూల వాతావరణం ఉందని, దీనికి నిదర్శనం కనిగిరిలో జరిగిన బహిరంగ సభ విజయవంతమేనని మిగతా 2 లో ...

అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలు

8లో

జగన్ అవినీతి అరాచక పాలనను

అంతం చేద్దాం

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలికి సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం ఒక ప్రకటనలో ఏలూరి మాట్లాడుతూ అవినీతి అరాచక పాలనను తుదముట్టించడం మనందరి బాధ్యత రా కదలి రా కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కచెల్లెమ్మలకు మానప్రాణాలకు వైసీపీ ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయిందన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు దగాపడ్డారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందని,దీన్ని సెట్ రైట్ చేయాలంటే బాబే సీఎం కావాలన్నారు. నాడు అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటూ ఇచ్చిన పిలుపుకు యావత్ ఆంధ్రావని జేజేలు కొట్టిందని,ఇప్పుడు ఆ నినాదంతోనే దూసుకెళ్లేలా తెలుగుదేశం పార్టీ కార్యాచరణ రూపొందించిందన్నారు.ఈ నెల 29 వరకు మొత్తం 22 పార్లమెంట్ స్థానాల్లో చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైకాపా పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకే టీడీపీ జయహో బీసీతో ప్రజల ముందుకు వచ్చిందన్నారు. బీసీలు బలహీనులు కాదు బలవంతులనే నినాదమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అన్నారు.లక్షల మందిని నాయకులుగా తయారు చేసిన పార్టీ తెలుగుదేశం మిగతా 2 లో ...

పేదల కష్టాలు తెలిసిన నాయకుడు 'ఉగ్ర'

- మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- అన్న క్యాంటీన్ పైలాన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కనిగిరి : పేదల కష్టం తెలిసిన నాయకుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కనిగిరిలో శనివారం రెండో రోజు పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్ ప్రారంభించి 365 రోజులు అవుతున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పేదలకు స్వయంగా భోజనాలు వడ్డించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఫోటోలు దిగి ఉత్సాహపరిచారు. పరుచూరి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు. వైకాపాకు చెందిన పలువురు నాయకులను పార్టీ కండువా కప్పి తెదేపాలోకి ఆహ్వానించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు తెదేపా ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు, నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేలా నిరాటంకంగా అన్న క్యాంటీన్ ను డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో మిగతా 2 లో ...

పేదల కష్టాలు తెలిసిన నాయకుడు 'ఉగ్ర'

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించడం అభినందనీయమన్నారు. కనిగిరిలో రా కదలిరా ఎన్నికల శంఖారావం ప్రారంభం, బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం అమరావతి గ్రౌండ్ నుంచి పెనుగొండ సాధన ప్రాంగణం వద్దకు కారులో చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్లో హైదరాబాద్ కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డోల బాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు గొట్టిపాటి రవికుమార్, నాయకులు దామచర్ల జనార్ధన్, దామచర్ల సత్య, గూడూరు ఎరిక్షన్ బాబు, బి ఎన్ విజయ్ కుమార్, ముత్తుముల అశోక్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు,నారప శెట్టి పాపారావు, కందుల నారాయణరెడ్డి, ఎం ఎం కొండయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన కొనసాగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల డిమాండ్లలో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనంఇవ్వాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని,హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. నియోజవర్గంలో 1.60 లక్షల జనాభా ఉంటే పారిశుద్ధ కార్మికులు సుమారు 140 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రజలకు తగినంత సిబ్బందిని నియమించి కొరత లేకుండా చూడాలన్నారు.పేరుకేమో జిల్లా తెచ్చానని చెప్పుకుంటూ కొంతమంది పారిశుద్ధ కార్మికులను అధికారులు, నాయకులు తమ సొంత పనులకు వినియోగించుకుంటున్నారని దీనివలన సిబ్బంది కొరత ఏర్పడడంతో ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం నిల్వ ఉంటుందన్నారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడి కార్యకర్తలను, పారిశుద్ధ కార్మికులను, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామన్నారు. జన సేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ జనసేనపార్టీ - తెదేపా సంకీర్ణ ప్రభుత్వంలోనే ప్రజల సమస్యలు తీరతాయన్నారు. జిల్లా తెచ్చామని చెప్పుకుంటున్న నాయకులు నేడు ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సైకో ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చ లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో చెత్త మీద కూడా పన్ను వేసి ముఖ్య మంత్రి నేడు జీతాలు ఎందుకు పెంచడం లేదన్నారు.మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని,హెల్త్ అలవెన్స్ ఇవ్వా లన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు

బాపట్ల రూరల్ ఎస్సై కొండారెడ్డి బదిలీ



విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల రూరల్ ఎస్సై కొండారెడ్డి పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. బాపట్ల పట్టణ ఎస్సైగా పని చేస్తున్న సింగయ్యను రూరల్ ఎస్సైగా బాధ్యతలు అప్పగించారు. కొండారెడ్డి సుమారు నాలుగు నెలల పాటు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు.

కారుణ్య ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్కు దళిత నేత నీలం విన్నపం

విశాలాంధ్ర-ఒంగోలు: రెండు నెలలుగా పెండింగులో ఉన్న సుమారు 30 ఉద్యోగాలకు ఉద్యోగ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్కు విజ్ఞప్తి చేశారు.శనివారం తన కార్యాలయంలో విలేకరులతో నీలం నాగేంద్రరావు మాట్లాడారు చనిపోయిన ఉద్యోగస్తుల వారసులకు ఇవ్వవలసిన కారుణ్య నియామకాలను కలెక్టరేట్లో చాలా కాలంగా క్లియర్ కావడం లేదని అన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది మరణించిన వారి వారసులకు కూడా ఉద్యోగాలు ఇవ్వవలసి ఉండగా ఆ ఫైల్ కూడా మోక్షానికి నోచుకోక కలెక్టరేట్లోనే ఉందన్నారు. ఒంగోలుకు చెందిన బండి చెంచరత్నం ఎస్సీ ఎస్టీ హత్య కేసులో బాధితుడు అయిన బండి సుధీర్ కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వవలసి ఉంది 2022వ సంవత్సరం ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రామ్ నగర్ లో జరిగిన ఈ హత్య కేసులో సంవత్సరం దాటిన కూడా కలెక్టరేట్లో కాల యాపన తప్పితే కలెక్టర్ నుంచి ఉద్యోగం ఆర్డర్ రాలేదని అన్నారు. అలాగే చీమకుర్తిలో జరిగిన దేవరకొండ రత్తమ్మ ఎస్టీ కులస్తురాలి హత్య కేసులో కుమార్తె పాలపర్తి దుర్గకు కూడా ఉద్యోగం ఇవ్వవలసి ఉందని అన్నారు. ఒంగోలులో 2021 డిసెంబర్లో జరిగిన కోడూరి శాంతి అనే మాదిగ మహిళ హత్య కేసులో వారసులు ఎవరనే మనువాద కొర్రీలతో ఆర్డిఓ ఎంఆర్ఓలు ఎంక్వైరీల పేరుతో రెండు సంవత్సరములు సాగదీసి ఈ కేసులో కూడా ఉద్యోగం ఫైలు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు కొరకు కలెక్టరేట్లో ఉందన్నారు. కావున రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలు మరియు ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-సీఎస్పురం : మండలంలోని అంబవరం, ఉప్పలపాడు గ్రామలలో ఎంపీడీఓ సీహెచ్ రామ చంద్రరావు పర్య వేక్షణలో అన్ని శాఖల అధికారులతో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలు సమీక్ష లబ్ధిదారులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో కనిగిరి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య, కేంద్ర వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్యాస్ పంపిణీ, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు, రైతులకు సంబంధించిన డ్రోన్ పరికరం డిస్ప్లే క్యాలెండర్లు పంపిణీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలపై డిజిటల్ వ్యాన్ ప్రదర్శన, అనేక సంక్షేమ పథకాలను వివరణ, సమీక్ష అవగాహన కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరపురం బిజెపి మండల అధ్యక్షులు ఇండ్ల వెంకట సత్యం సత్యం, పామూరు మండల అధ్యక్షులు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చెన్నయ్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, కనిగిరి టిడిపి ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తలపెట్టిన బహిరంగ సభకు వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాని టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి శనివారం తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధ్యం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రణాళికాబద్ధంగా చదివి సాధన చేస్తే పోటీ పరీక్షలలో విజయం సాధించడం సాధ్యమవుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ కే.ఎస్ లక్ష్మణ రావు అన్నారు. స్థానిక ఎస్.జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణమండపంలో పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రూప్-2 పరీక్ష పట్ల అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన వారికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల చరిత్ర,భారత సమాజం పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా రామారావు, భిక్షాలుబాబు,షేక్ జాని బాషా, అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి అరాచక పాలనను అంతం చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు.బీసీలకు రాజ్యాధికారాన్ని ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అన్నారు. వైసీపీ పాలనలో దాదాపు 52.5 శాతం ఉన్న బీసీలు , మైనారిటీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు.వైఎస్సార్సీపీ హయాంలో 26 మందికి పైగా బీసీలు హత్యకు గురైయ్యారన్నారు. 650 మంది నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 43 మందికి పైగా ముస్లిం మైనార్టీలపై దాడులు జరిగాయన్నారు. సంక్షేమ పథకాల కోసం ఏపీలో బీసీ సబ్ ప్లాన్ నుంచి దాదాపు రూ. 34,000 కోట్లు మళ్లించారన్నారు. నామినేటెడ్ పదవులు ఎక్కువ శాతం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయించారని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు.

- పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

జగన్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం చేశారన్నారు. గ్రామాలు దేశానికి పట్టు కొమ్మలు అని గాంధీజీ అన్నారని వాటిని బలోపేతం చేయడానికి తెలుగుదేశం పార్టీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో సర్పంచ్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి స్వాహా చేసిన ఘనుడు సైకో రెడ్డి అన్నారు.గ్రామాల్లో సీసీ రోడ్లు లేవు, వేసిన వాటికి బిల్లులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. కీలకమైన పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసే బాధ్యతను తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

విశాలాంధ్ర - బాపట్ల : రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించి పరిమిత వేగంతో వాహనాలు నడపి వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు సూచించారు. జిల్లాలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 71 బ్లాక్ స్పాట్స్ యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద పోలీస్ అధికారులు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తూ వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు వివరించారు.యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామం నుండి జాగర్లమూడి గ్రామం మధ్య ప్రధాన రహదారిపై అక్కడక్కడ గుంటలు ఏర్పడడంతో పోలీస్ అధికారులు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో గుంతలను పూడిపించారు.వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలను నడపాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

సంక్షేమ పథకాల అమలులో సీఎం దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర-అద్దంకి : సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. శనివారం కొరిశపాడు మండల పరిషత్ కార్యా లయం వద్ద వైఎస్సార్ పెన్షనల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హనిమిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్మోహన్రెడ్డిని మరలా సీఎంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.వచ్చే ఎన్నికల్లో అద్దంకి గడ్డపై వైసీపీ జెండా ఎగురవేయాలని ప్రజల హర్షధ్వానాల మధ్య హనిమిరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో మండల జడ్పిటిసి సభ్యురాలు తాళ్ళూరి వెంకటరమణ, వైసీపీ నాయకులు కరణం సుబ్బయ్య, జంపు హరిబాబు,గుజ్జల జగన్మోహన్రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్లు, వైసీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు బాబు.. దిశా నిర్ధేశం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి నేను చూసుకుంటానని ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు, ట్రిపుల్ ఐటి, నిమ్జ్, యూనివర్సిటీ, ఫ్లోరైడ్ సమస్య, కారిడార్ తదితర అభివృద్ధి తదితర ప్రాజెక్టులకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పూర్తి చేద్దామని, ఈ అంశాలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు వారి వెనుక ఉన్న నాయకులు జగన్మోహన్రెడ్డి వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ నాయకులను కూడా కలుపుకొని ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక కనిగిరి ఇన్చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు ఇన్చార్జి దామచర్ల జనార్ధన్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, గిద్దలూరు ఇన్ఛార్జి ముత్తుముల అశోక్రెడ్డి, యర్రగొండపాలెం ఇన్చార్జి ఎరిక్షన్బాబు, మార్కాపురం ఇన్చార్జి కందుల నారాయణరెడ్డి, కందుకూరు ఇన్ఛార్జి ఇంటూరు నాగేశ్వరరావు, కొండెపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి, టీడీపీ యువతనేత దామచర్ల సత్య, దర్శి నియోజకవర్గం నుంచి రవికుమార్, పాపారావు, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, చీరాల ఇన్చార్జి ఎంఎం కొండయ్య, సమావేశంలో పాల్గొన్నారు.

పుంజుకుంటున్న టీడీపీ... పట్టు కోల్పోతున్న వైకాపా

- ఉగ్రనాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు
- తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపిన చంద్రబాబు బహిరంగ సభ

విశాలాంధ్ర-పీసీపల్లి : కనిగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పుంజుకుంటుండగా మరోవైపు వైసీపీ కార్యకర్తలు పార్టీని వీడుతుండడంతో కనిగిరి నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టుకోల్పోతుంది ప్రజలు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వం పట్ల నమ్మకం ఉంచటం వైసీపీ నాయకత్వం జగన్ పాలనపట్ల కార్యకర్తలు నమ్మకం కోల్పోవడం మరొకవైపు వైసీపీ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు విసిగిపోయి టీడీపీ వైపు పయనమవుతుండటమే ఇందుకు నిదర్శనం. ఇదే సందర్భంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏదో ఒకచోట ఏదో ఒక గ్రామం నుండి వైసీపీని వీడి టిడిపిలోకి చేరడమే ఇందుకు నిదర్శనం అని చెప్పుకోవచ్చు. ఐదేళ్లకు ఒకసారి నాయకులు ఎన్నికల సమయంలో రావడం ఆ నాయకులు ఓడినా గెలిసినా ప్రజలకు అందుబాటులో లేకుండాపోతున్నాడు. ఇందుకు కారణం ప్రస్తుతం ఉన్న వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు సక్రమంగా సమకూర్చకపోవడం చేసిన పనులకు బిల్లులు రాకపోవడం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోవటం మరలా పోటీ చేసిన గ్రామానికి వెళ్లి ఓట్లు అడగాలంటే తమపై నమ్మకం కోల్పోయిన ఓటర్లు పెదవి విరుస్తున్నారు. తదితర అంశాలతో విసుకు చెంది కార్యకర్తలు అధికార పార్టీపై నమ్మకం కోల్పోతున్నారు.

ఉగ్ర నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు

ఇది ఇలా ఉండగా గత 15 సంవత్సరాలుగా సుదీర్ఘంగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి రాజకీయాల్లో ఉంటూ గెలిచినా ఓడినా స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ చిన్న సమస్య వచ్చినా వారికి అండగా ఉండటమే ఉగ్ర నరసింహారెడ్డి వైపు ప్రజలు మొగ్గు చూపటానికి ప్రధాన కారణమని పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించుకోవాలన్న కసి టీడీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో పాటు ప్రజల్లో ఉగ్ర నరసింహ రెడ్డికి విపరీతమైన సానుభూతి పెరిగి టీడీపీలోనికి వలసలు పుంజుకోవడం కారణంగా చెప్పుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపిన చంద్రబాబు ప్రసంగం

కనిగిరిలో వెలుగొండ సాధన ప్రాంగణంలో జరిగిన ఎన్నికల శంఖారావంలో భాగంగా టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రా కదిలి రా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగం యువతలో జోష్ ఉత్తేజాన్ని నింపింది. ఉగ్ర నంసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆరు మండలంలోని మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు భారీగా జన సమీకరణ చేసి చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయడంతో పార్టీ శ్రేణులు ఎనలేని సంతోషం నెలకొంది. ఆశించిన దాని కంటే అధికంగా పార్టీ శ్రేణులు కదిలి రావడంతో నియోజకవర్గం లో టీడీపీ గెలుపొందటం ఖాయమని తెలుగు తమ్ముళ్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంటలను కాపాడుకోవచ్చు

విశాలాంధ్ర-పర్చూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.వాణిశ్రీ తెలిపారు. స్థానిక ఆర్బీకేలో శనివారం సమావేశం నిర్వహించారు. రైతులు, సిబ్బందితో ప్రణాళికలు తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలను కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా శనగ పంటను వేసిన శ్రీకాంత్ అనే రైతును సన్మానించారు. ఈ సమావేశంలో ఏఓ రామ్మోహనరెడ్డి, డీజెడ్ఎంపి మోహన్, ఎన్ఎఫ్ఏలు శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, వరదానమ్మ, శ్రీవల్లి, ఎంటీ అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవస్థానంలో దీక్షదారులకు ఓగూరు భిక్ష

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం కీర్తిశేషులు ఓగూరు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ల జ్ఞాపకార్ధం ఓగూరు బుజ్జమ్మ, ఓగూరు నరసింహారావు వరలక్ష్మి దంపతులు, కుమార్తె సంధ్య, కుమారులు మనోజ్ కుమార్, మహేష్ కుమార్‌ల ఆర్థిక సహాయంతో దీక్ష దారులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శాశ్వత అన్నదానం కార్యక్రమంలో భాగంగా ఓగూరు నరసింహారావు 2018లో ఒక లక్ష వెయ్యినూటపదహారు రూపాయలు దేవస్థానానికి విరాళం అందచేశారు. దేవస్థానం అధ్యక్షులు గుత్తి వెంకటరాజా, కావిటి వెంకటసుబ్బయ్య లు తెలిపారు. అన్నపూర్ణాదేవికి పూజానంతరం కీర్తిశేషులు ఓగూరు వెంకటేశ్వర్లు ధర్మపత్ని, బుజ్జమ్మకు దేవస్థానం చైర్మన్ కావిటి వెంకటసుబ్బయ్య స్వామివారి పట్టు వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచూరి సురేష్, వాయినేని వైట్ బాల్యాద్రి, ఓగూరు ఏడుకొండలు మాలలు ధరించిన అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా శాఖ అధికారులకు ఏపీ టీజీ అభినందనలు

విశాలాంధ్ర-ఒంగోలు: జిల్లాలో ఎయిడెడ్ ,కార్పొరేషన్ మున్సిపల్ మండల పరిషత్ , జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బిల్లులను జిల్లా ఖజానా శాఖ అధికారి జగన్నాథ రావు, ఏ టి ఓ ఎలిసా రాణి,వెంటనే స్పందించి ఉపాధ్యాయుల బిల్లులను సి ఎఫ్ ఎం ఎస్ అధికారులకు పంపినందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు ప్రభాకర్ రెడ్డి ఆర్థిక కార్యదర్శి కే రమేష్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపినారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీపీ,జడ్పీటీసీలు

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రా కదిలి రా ఎన్నికల శంఖారావంను శుక్రవారం కనిగిరిలో ప్రారంభించారు. శనివారం కనిగిరి లోని అమరావతి గ్రౌండ్ టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడును పామూరు మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, మాజీ జెడ్పిటిసి బొల్లా మహాలక్ష్మమ్మలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మృతి చెందినబొల్లా మాల్యాద్రి మరణానికి కారణాలు అడిగి తెలుసుకుని బొల్లా మహాలక్ష్మమ్మ ను చంద్రబాబు ఓదార్చారు. మహిళల గౌరవాన్ని పెంచే విధముగా మహిళా శక్తి పథకాలు ను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు జరుగుతాయని, మహిళా శక్తి పథకాలను ఇంటింటా తెలియపరచి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుకు నడుం బిగించాలని చంద్రబాబు నాయుడు కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు పువ్వాడి వెంకట లక్ష్మమ్మ, దేవరపు రమణమ్మ, పువ్వాడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ

జీవిత పురస్కార కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-అద్దంకి : పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల జీవిత సాఫల్య పురస్కార-2024 కరపత్రాలను శనివారం స్థానిక రోట రీ కార్యాల యంలో ఆవిష్కరించారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల జీవిత సాఫల్య పురస్కారం-2024ను ప్రముఖ కవి,నటుడు, దర్శకుడు,సినీ,నాటక రచయిత తనికెళ్ళ భరణికి ఇవ్వనున్నట్లు ట్రస్టు అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈనెల 7న పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మండపం నందు జరిగే కార్యక్రమానికి పట్టణ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కవి డివిఎం, సత్యన్నారాయణ,రోటరీ అధ్యక్షులు మలాది శ్రీనివాసరావు కోరారు.

పమిడిపాడులో రైతు ప్రదర్శన క్షేత్రం

విశాలాంధ్ర-అద్దంకి : కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో ఒగ్గుల రామకృష్ణకు చెందిన మిరప పొలంలో శనివారం బాయర్ సెమినిస్ కంపెనీ వారు రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు.

కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుకు విత్తనం యొక్క ఎంపిక ప్రధాన్యమని ప్రస్తుతం మిరప పంటను పీడిస్తున్న తామర పురుగు,నల్లి,బొబ్బర వంటి రోగాలను తట్టుకునే విత్తనాలు ఎస్ విహెచ్ఎం 1477 గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అరుణ్‌కుమార్, అనిల్,వాసు, డిస్ట్రిబ్యూటర్స్ రామకృష్ణ,నాగిరెడ్డి,నర్సరీ రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం కార్యాలయము- రేపల్లె

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం158/2022/ఎ2., తేది: 06-01-2024

రేపల్లె పురపాలక సంఘం యాజమాన్యమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి 25 సంవత్సరముల లీజు కాలపరిమితి పూర్తి అయిన షాపు రూములకు లీజుకిచ్చుటకు పురపాలక సంఘం కార్యాలయము నందు ది. 17-01-2024 తేదిన శ్రీయుత కమీషనరు గారిచే కాని వారి అనుమతి పొందిన వారిచే గాని 2023-2024 సంవత్సరము గజిట్ నోటిఫికేషన్ లోని షరతుల మెరకు బహిరంగవేలము నిర్వహించబడును. కావున పాటలో పాల్గొనువారు ఎస్.సి & ఎస్.టి షాపులకు సంబంధించి కులధృవీకరణ పత్రముతో పాటలో పాల్గొనవలయును. ఇతర వివరములు ఈ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కమిషనర్,
రేపల్లె పురపాలక సంఘము

ADDANKI MUNICIPALITY

E-Procurement Tender Notice - 2nd Call

S. No.	Tender Notice No	Name of the Work	Estimate Amount (Rs.in Lakhs)
1	70/NIT/2023-24 to 74/NIT/2023-24	Providing CC Drain and Road and Water Plant in Addanki Municipality	17.45

Download Start Date & Time	:	06/01/2024 6.00 PM
Download End Date & Time	:	16/01/2024 6.00 PM
Receipts of Bids end Date & Time	:	17/01/2024 4.00 PM
PQ Stage Opening Date & Time	:	17/01/2023 5.00 PM

E-PROCUREMENT TENDER NOTICE

S. No	Tender Notice No	Name of the Work	Estimate Amount (Rs.in Lakhs)
1	75/NIT/2023-24 to 81/NIT/2023-24	Providing CC Drain and Road and Welcome Arch and water Tanker in Addanki Municipality	58.10

Download Start Date & Time	:	06/01/2024 6.00 PM
Download End Date &: Time	:	20/01/2024 6.00 PM
Receipts of Bids end Date & time	:	22/01/2024 4.00 PM
PQ Stage Opening Date & Time	:	22/01/2023 5.00 PM

For further details visit **"www.eprocurement.gov.in"**
Contact Phone No: 6303389234

Commissioner,
Addanki Municipality

అంగన్వాడి ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గం

– కేంద్ర కార్మిక సంఘాలు ఖండన

విశాలాంధ్ర-ఒంగోలు : అంగన్వాడి ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించడం జరిగింది.గత 26 రోజుల నుంచి అంగన్వాడి ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేయాలని పోరాటం చేస్తా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా నిర్వీర్యం చేయాలని సమ్మె ని విరమింపజేయాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అంగన్వాడీ ఉద్యోగులు పట్టుదలగా పోరాటం కొనసాగిస్తామన్నారు. అంగన్వాడీ పోరాటాన్ని కేంద్ర కార్మిక సంఘాలు అభినందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఆరు మాసాల పాటు సభలు సమావేశాలు సమ్మెలు చేయరాదని చట్టం తీసుకురావటం చాలా దుర్మార్గమైన విషయం ఈ ఈ ఎస్మా చట్టాన్ని కేంద్ర కార్మిక సంఘాలైన సిఐటియు ఏఐటియుసి ఐఎఫ్టియు ప్రకాశం జిల్లా కమిటీ లు తీవ్రంగా ఖండిస్తా ఉన్నాయి. ఈనెల 7న జిల్లా కేంద్రంలో జిఓ ప్రతులను దగ్ధం చేయటం జరుగుతుంది.

ఎస్మా ప్రయోగించటం అవివేకం

విశాలాంధ్ర-కనిగిరి : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 26 రోజులుగా వివిధ రూపాల్లో సమ్మె చేస్తున్న అంగన్వాడీల పై జగన్ సర్కార్ ఎస్మా ప్రయోగించడం అవివేకమని ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 2 జారీ చేయటం సమంజసం కాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలు కట్టడి చేయటానికి వైసిపి ప్రభుత్వం ఎస్మా ను ప్రయోగించడం న్యాయసమతం కాదన్నారు. కావున వైసిపి ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జిగా నియమితులైన తాటిపర్తి చంద్రశేఖర్‌ని స్టేట్ ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోకల ఆవులయ్య యాదవ్, మండల కార్యవర్గ సభ్యులు వెన్నా శివ కృష్ణారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, రెగుమానిపల్లి సార్పంచి పాలగిరి వెంకట రామాంజి రెడ్డి, మండల సంఘం ఉపాధ్యక్షులు, సుంకేసుల సర్పంచి గుడ్డెపోగు రమేష్ తదిరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన సేవలే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలి

జిల్లా ఎస్పీ మల్లికగర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటకు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మల్లికగర్గ్"పోలీస్ గ్రీవెన్స్ డే" నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది మరియు హోం గార్డ్స్ వారి సస్పెండ్ నుండి రిలీవ్, ఇతర సమస్యలు గురించి అర్జీ రూపంలో ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలన్నింటినీ సావధానంగా విని, వాటికి తగిన పరిష్కార మార్గం చూపుతానని భరోసా ఇచ్చారు. వారి సమస్యలను సంబంధిత డిపిఓ సిబ్బందితో చర్చించి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సతమత పడకుండా వారు వృత్తి పరంగా, ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి తద్వారా సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే ప్రధాన లక్ష్యమని, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది వారి సమస్యలను తెలియజేసిన వెంటనే పరిష్కారిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం నాల్గోవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సంకల్ప యాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను మోసం చేశారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పోటీ కార్మికులచే పనులు నిర్వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వార్డులలో పనిచేస్తున్న కార్మికులను సమ్మె చేస్తున్న కార్మికులను అడ్డుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైందకాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాగాంజనేయులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, చొక్కాకులు శివ శంకర్, ముత్యాల దుర్గారావు, సత్యవతి, కుసుమ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా ఎస్మా చట్ట ప్రయోగం సరికాదు

– ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల శ్యామ్యూల్

విశాలాంధ్ర - చీరాల : ఇచ్చిన హామీలు అమలు చేయమని అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమని దీనిని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందని ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కార్మికులపై ఎస్మా చట్టాన్ని ఖండిస్తూ విలేఖరుల సమావేశం నిర్వహించారు. బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ డిసెంబరు 7న సమ్మె నోటీసు ఇచ్చి 11 సమస్యలు పరిష్కరించమని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టి యు జాయింట్ ఏక్షన్ కమిటీగా ఏర్పడి మెమోరాండం ఇస్తే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించ కుండా బలవంతంగా కార్మికులను సమ్మెలోకి నెట్టారన్నారు. నేటికి 26 రోజుల నుండి వివిధ రూపాలలో శాంతి యుతంగా అంగన్వాడీలు సమ్మెని కొనసాగిస్తుంటే నేడు రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌ను అత్యవసర ప్రజా సేవల పేరుతో ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. గౌరవ వేతనం తీసుకుంటున్న అంగన్వాడీలపై అత్యవసర సర్వీసుల పేరుతో ఎస్మా చట్ట ప్రయోగం సరికాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా అంగన్వాడీల న్యాయమైన కోరికలు పరిష్కరించి సమ్మెను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందే

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు , ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అన్ని రకాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఒంగోలు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి డి.జె ఫ్.ఒంగోలు డివిజన్ కార్యదర్శి ఉబ్బా అశోక్ అధ్యక్షత వహించారు. డి జె ఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ నూకతో రవికుమార్ మాట్లాడుతూ చిన్న పత్రికలు యూట్యూబ ర్స్ అద్దె ఇళ్లలో ఇళ్ళలో ఉండి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెద్ద పత్రికల్లో పని చేసే జర్నలిస్టులు గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు పొందారని ,చిన్న పత్రికల్లో పని చేసే వారికి ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవట్లేదు అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి భక్తవత్సలం మాట్లాడుతూ అర్హు లైన జర్నలిస్టులందరికీ గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వ ఆదుకోవాలన్నారు. అన్ని రకాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డి జె ఎఫ్ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. ఈ పోరాటంలో తాము కలిసి పని చేస్తామని హామీ ఇచ్చారు .ఎడిటర్స్ అండ్ పబ్లిషర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి మాట్లాడుతూ చిన్న పత్రికల్లో పని చేసే వారికి గుర్తింపు కార్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు .ప్రభుత్వం ఆలోచించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు .అన్ని రకాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఒంగోలు కమిటీ చేస్తున్న పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిజెఎఫ్ జిల్లా కో కన్వీనర్ బి శ్రీనివాసరావు, ఒంగోలు డివిజన్ అధ్యక్షులు జి శివాజీ ,సాంస్కృతి కార్యదర్శి నూకతోటి శరత్ బాబు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జర్నలిస్టులు ర్యాలీగా సంయుక్త కలెక్టర్ కే. శ్రీనివాసులు కలిసి వినతి పత్రం అందజేశారు .అన్ని రకాల జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు .స్పందించిన జేసి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటియుసి, సిఐటియు యూనియన్లు కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం గేటుకు తాళాలు వేసి ఎదుట నిరసన తెలిపారు. ఏఐటియుసి కనిగిరి నియోజకవర్గ అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, ఖాసిం వలి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికుల శ్రమను గుర్తించి తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇమన్నా ప్రభుత్వం సుముఖంగా లేదన్నారు. మూలవేతనమిస్తే రూ.151 కోట్లు భారం పడుతుందని చెప్పి విపత్తులలో ప్రాణాలు తెగించి పని చేస్తున్నటువంటి పారిశుధ్య ఇతర కార్మికులలను పర్మినెంట్ చేయకుండా అన్యాయం చేయడం తగదు అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆలూరి కోటయ్య, సిహెచ్ అశోక్, నాసర్, కిరణ్ మస్తాన్, రవి, తాజుద్దీన్, మధు, మస్తాన్ వలి, ఐజక్, సామ్యేలు, సుబ్రహ్మణ్యం, ఖాసింపీరా, చంద్రమోహన్, యేసుబాబు, మూర్తి, ఇమాం హుస్సేన్, పవన్ పాల్గొన్నారు.

ఎస్టీయు వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలను ఈ నెల 12, 13 తేదీలలో కర్నూలులో జరుగనున్నాయని, ఈ వేడుకలను జయప్రదం చేయాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వజ్రోత్సవ వేడుకలు పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం మండల విద్యా శాఖాధికారులు వి.వెంకటేశ్వరరావు, రాజరత్నం లు ఆవిష్కరించారు.ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాటం చేసే సంఘం ఎస్టీయుగా ఉపాధ్యాయ వర్గంలో మంచి గుర్తింపు ఉన్నదని జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ అన్నారు. ఈ వేడుకలకు ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎస్టీయు పీవీపాలెం మండల శాఖ తరుపున అయన కోరారు. మండల శాఖ అధ్యక్షులు ఈమని సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి జి రమేష్ బాబు, ఆర్థిక కార్యదర్శి డి.నానిబాబు ఇతర కార్యవర్గ సభ్యులు కాంచనరావు, ఎ శ్రీనివాసరావు, మండే ప్రభాకర్ రావు, కే శివప్రసాద్, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో ఉన్న 10వ హద్దు అయినటువంటి కొప్పు వారి బజార్ నందు అయోధ్య రాముల వారి అక్షింతలు, ప్రతిమ పంపిణీ ప్రతి ఇంటికి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తరుపున జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా కార్య వర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్, గిద్దలూరు అసెంబ్లీ ఎస్సీ మోర్చ ఇంఛార్జి బండారు జయ ప్రసాద్ మరియు అమ్మవారి దేవాలయం కమిటీ మెంబర్‌లు అయిన సూ రే రామ చంద్రుడు , చందలురి హరి పాల్గొనడం జరిగింది.

విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్స్ పంపిణీ

విశాలాంధ్ర - పిట్లవానిపాలెం : పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్స్ ను సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంచం అనూష ప్రసన్న రాజు సూచించారు.శ్రీ మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్స్ ను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంచం అనూష ప్రసన్న రాజు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్య, బాపట్ల జిల్లా కోశాధికారి దేవేంద్ర రాజు, ప్రధానోపాధ్యాయులు భూపతి రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు దాదా అమీన్ పీర్ గంధ మహోత్సవం

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని జాండ్రపేటలో సోమవారం సాయంత్రం 6 గంటల నుండి శ్రీ దాదా అమీన్ పీర్ స్వామి 48వ గంధ మహోత్సవం ప్రారంభమవుతుందని దాదా అమీన్ పీర్ దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటల నుండి సూఫీ తత్వ విశిష్టతను, సూఫీ గురువుల మహిమలను, జీవిత చరిత్రను ప్రవచనాల రూపంలో ఉపన్యసిస్తారన్నారు. రాత్రి 12 గంటలకు శ్రీవారి గంధము, మెరవణి దర్గా నుండి బయలుదేరి ఫకీర్ల జల్సాలతో, బ్యాండు వాయిద్యములతో, రంగు రంగుల విద్యుద్దీపాల అలంకరణలతో, బాణా సంచాలతో జాండ్రపేట పుర వీధులలో నగరోత్సవము జరిగి మరుసటి రోజు తెల్లవారుఝామున దర్గాకు చేరు తుందన్నారు. అనంతరం కడప పెద్ద దర్గా పీఠాధిపతులు హజరత్ ఖ్వాజా సయ్యద్ ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్టివుల్ ఖాదరి సజ్జాద నషీన స్వాముల గంధము చదివింపులు జరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం గం.7-00లకు అఖండ దీపారాధన కార్యక్రమము జరుగుతుందని అనంతరం స్వాముల వారు భక్తులందరికీ ఆశీర్వాదములు ఇచ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష

విశాలాంధ్ర - బాపట్ల : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్ష శనివారం 18 వరోజుకు చేరుకుంది. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి డిమాండ్లు నెరవేర్చమంటూ నినాదాలు చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల అందరిని రెగ్యులర్ చేయాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. శిబిరం వద్ద పలువురు వక్తలు మాట్లాడుతూ న్యాయమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్స్ను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం బెదిరింపులుకు పోకుండా చర్చలకు పిలిచి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదువు కొన్నామని తమ సమస్యలకు వెంటనే పరిష్కారం మార్గం చూపాలని కోరారు. మాణిక్యరావు, రాజేష్, సుధారాణి, అబ్రహాము, సుజాత, అంజనాదేవి, నాగమణి, నాగరాజు తదితరులున్నారు.

సమస్యల సాధనే లక్ష్యం..అంగన్వాడీల నిరసన క్రీడలు

విశాలాంధ్ర -రేపల్లె : తొక్కుడు బిళ్ళ ఆటతోపాటు ఆగ్రహం వస్తే ఆదిపరాశక్తులు కూడా అవుతామంటూ అంగన్వాడీలు తొక్కుడు బిళ్ళ ఆటఆడుతూ ప్రభుత్వానికి నిరసన జ్వాలలు రగిలించారు. రేపల్లె తాలూకా కార్యా లయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో జరుగు తున్న నిరవధిక సమ్మె 26వ రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం అంగన్వాడీలు సమ్మె శిబిరం వద్ద తొక్కుడు బిళ్ళ ఆట ఆడుతూ ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదించారు. అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి.నాగ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో అంగన్వాడీలో పని చేస్తున్న అక్క చెల్లెమ్మల పడుతున్న కష్టాలను నేను విన్నాను,నేను చూస్తున్నాను మీ అందరి దయవల్ల ఆ దేవుని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ వేతనాలు ఇచ్చి మీ కుటుంబాలలో సంతోషాన్ని నింపుతానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలను మోసం చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 26 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా చట్టాని ప్రయో గిస్తామంటూ జివో విడుదల చేసి భయ పెట్టాలని చూస్తే అధికార పీఠం కదులుతుందని నాగ మల్లేశ్వరమ్మ హెచ్చరించారు.

- పెన్షనర్స్ అసోసియేషన్ సంఘీభావం

స్థానిక తాలూకా కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26 రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మెకు బిఎస్ఎన్ఎల్ ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ సంపూర్ణ సంఘీభావం తెలియజేస్తుందని అసోసి యేషన్ రేపల్లె బ్రాంచ్ కార్యదర్శి కె.పి.వి ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సత్వరం సమస్యలను పరిష్కరించాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వై.కనకదుర్గ, ఝాన్సీ, మణి, సబీనా నసింమున్నీస్సా, మాధవి, మీరాబి, నాగలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏలూరి రామచంద్రారెడ్డి ఎటువైపు..?

విశాలాంధ్ర-మార్కాపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తనకు సరైన గుర్తింపు, గౌరవం లేక పోవడంతో డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి గత కొంత కాలంగా ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించ కుండా స్తబ్ధతగా ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇదే అదునుగా రామచంద్రారెడ్డిని తమ పార్టీలో చేర్చుకునేందుకు అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ఇటు రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీలు ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలుస్తుంది. ఈయన విద్యార్థి దశలోనే కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఎన్ఎస్ఐయులో చురుకైన పాత్ర పోషించారు. అందులో భాగంగా ఎస్కెడి యూని వర్సిటీలో విద్యార్థి సంఘం అధ్యక్షులుగా పనిచేసే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం యువజన కాంగ్రెస్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికార ప్రతినిధిగా సమర్ధవంతంగా పని చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్కాపురం నియోజక వర్గం నుండి పోటీ చేశారు. అలాగే 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ నియో జకవర్గంలో నుండి పట్టభద్రుల తరపున పోటీ చేశారు. ఈయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వున్న సమయంలో పలు టీవీ చర్చ వేదికల్లో ప్రజా సమస్యలపై తనదైన శైలిలో మాట్లాడుతూ ప్రజలను బాగా ఆకట్టుకున్నారు. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన, అందుకు తగ్గట్టు లోతైన విశ్లేషణ,మంచి వాక్చాతి పటిమ ఉన్న యువ నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డిని ఎలాగైనా తమ తమ పార్టీలోకి చేర్చుకునేందుకు ఇటు బిజెపి, అటు తెలుగుదేశం పార్టీలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఆయా పార్టీల కీలక నేతలు డాక్టర్ ఏలూరితో టచ్ లోకి వచ్చినట్లు అయన అనుచరులు పేర్కొంటున్నారు.

బాబుతోనే భవిష్యత్తు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మరల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్య మంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుంటుం దని తెదేపా నాయకులు అన్నారు. ఈపురుపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య ఆదేశాలతో ఇంటింటికి తిరిగి తెదేపా ప్రవేశ పెట్టిన పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. గుర్రం వెంకటేశ్వర్లు, గుద్దంటి చంద్రమౌళి, అందే ఉమా మహేశ్వరరావు, అవ్వారు సాంబయ్య, యర్రాకుల ప్రసాద్, విన్నకోట జగదీష్, సయ్యద్ ముతహర్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - బల్లికురవ : గ్రామాలు ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వేమన హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని వేమవరం గ్రామంలో కే.శ్రీను ఇంట్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో తనిఖీ చేయగా 35 మద్యం బాటిల్లు దొరికినట్లు ఎస్సై తెలిపారు.శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సూచించారు.గ్రామాలలో ఎవరైనా మద్యం తాగి అల్లర్లు సృష్టించిన,మద్యం అమ్మిన పేకాట, కోడిపందాలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - బాపట్ల : భావపురి విద్యాసంస్థలలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 గ్రూప్ 2 మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు విద్యాసంస్థలు ప్రిన్సిపల్ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు.సిఇడిఎం మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, భావపురి విద్యా సంస్థల సయుక్తంగా సహకారంతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1,గ్రూప్ 2 ఉద్యోగ ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకున్న క్రిస్టియన్ (బీసీ-సి),ముస్లిం(బీసీ-ఇ),దూదేకుల(బీసీ-బి), బౌద్ధ, జైన, శిక్కు, పారశీక వంటి మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు బాపట్ల భావపురి విద్యాసంస్థలలో ఈ నెల 8వ తేదీ నుండి 50 రోజులను ఉచిత శిక్షణను అందించేందుకు సంబంధించిన కరపత్రాలను పాంప్లేట్స్ ,బ్రోచర్స్ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, ఎమ్మెల్యే కోన రఘుపతి శనివారం ఆవిష్కరణ చేశారు. 8వ తేదీ లోపు అర్హత ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకుని క్లాస్లకు రెగ్యులర్గా హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రంజిత్ భాషా తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ మైనారిటీ అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో సిఇడిఎం ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రంలో శిక్షణతో ఉద్యోగాలు పొందాలని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మరిన్ని వివరాలకు 9848 791935, 9348744210 ఫోన్చేసి సమాచారం తెలుసుకోవాలని భావపురి విద్యాసంస్థలు ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. కర్లపాలెం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, హరికృష్ణ, త్రివిక్రమ్, వేణుమాధవ్, మహ బూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పారదర్శంగా విచారణ చేయాలి

- కలెక్టర్ పి.రంజిత్ భాష



విశాలాంధ్ర - బాపట్ల : ఓటర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శంగా విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష అధికారులు ఆదేశించారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్ల నమోదు కోసం వచ్చిన అర్జీల విచారణపై జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ బాపట్ల మండలానికి సంబంధించి ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పుల కోసం వచ్చిన అర్జీలను ఎలా పరిష్కరించారనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి జి.రవీంద్ర ,బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, తహసీల్దార్ సుధా రాణి పాల్గొన్నారు.

'ఎస్మా' ప్రయోగిస్తే భయపడేది లేదు

-ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మి

విశాలాంధ్ర-వెలిగండ్ల: ఎస్మా ప్రయోగించి అంగన్వాడీలను భయపెట్టాలని చూస్తే డిమాండ్స్ పరిష్కరించే వరకు సమ్మె ఏ పరిస్థితులలో కూడా విరమించబోమని ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అంగన్వాడీ కార్యాలయం నందు నిరాహార దీక్ష 26వ రోజున ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి సమస్యల మీద 26వ రోజున సమ్మెకు మద్దతుగా వెలిగండ్లలో నిరసన తెలుపుతున్నట్లు ఐదవ తారీకు విధుల్లోకి హాజరు కాకపోతే మీ అంతు చూస్తాం , ఉద్యోగాల నుంచి తీసేస్తాం అంటూ అంగన్వాడీలను భయపెట్టాలని చూస్తే సహించేది లేదని, ఇప్పుడు కొత్త ప్రయోగంతో ఎస్మా చట్టం ఆరు నెలలపాటు ప్రవేశపెడుతున్నామని బెదిరించటం తాటాకు చప్పులకు ఎవరు భయపడరని ప్రభుత్వం దిగివచ్చేంత వరకు అంగన్వాడి సమ్మె కొనసాగుతుందని ఆమె అన్నారు. ఈ క్రమంలో జిల్లా సిఐటియు నాయకులు రాయళ్ళ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు తూతూ మంత్రంగా భయపెట్టి విధుల్లోకి చేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తుందని ఇలాంటి వాటికి అంగన్వాడీలు భయపడరని ఇప్పటికే 26 రోజులు గడిచిందని, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల సమ్మె, సర్వ శిక్ష అభియాన్ తదితర వారు సమ్మె చేస్తున్న ప్రభుత్వం దిగి రాలేదని, ఇలాంటి మొండి పట్టుదల విడనాడి వారిని ఆదుకోవాలని వారన్నారు. ఈ దీక్షల్లో సోము వెంకట శ్రీ లక్ష్మి, రెడ్డమ్మ తిరుపతమ్మ, గౌరై ముచ్చు సలోమి, రాయల రమాదేవి, శెట్టిసునీత, గ్యారాతశ్వరమ్మ, గోపవరపు రమాదేవి, అక్కి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన పోలూరు గ్రామస్తులు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పోలూరు గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 9 కుటుంబాలు,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపిలో చేరారు. వారికి రాంబాబు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు..ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు ఐమాల శ్యాంసన్,మండల వైస్సార్సీపీ సీనియర్ నాయకులు చిలుకూరి క్రిష్టయ్య చౌదరి, జిల్లెల్లమూడి హరిబాబు,గద్దల పందుయ్య,గద్దల జీవరత్నం,గద్దల కాజియ్య, పోలూరి ఆరోగ్యం, కందుల బెసలేరు, పోలూరి నాగయ్య, పోలూరి రామ్మోహన్, గొర్రెపాటి గురకయ్య,నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ముస్సంగి వీరయ్య, పులగం చందు,పాలెపోగు పవన్,బిల్లా రంగా,పర్చూరు వాసు,బొప్పేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంఈఓ-2కి కుర్చీ ,బల్ల, బీరువా వితరణ

విశాలాంధ్ర- వెలిగండ్ల : విద్యా వనరుల కేంద్రమైన ఎంఈఓ-2 కార్యాలయానికి కుర్చీ, బల్ల, బీరువాలను దాతలు దేవిరెడ్డి రామిరెడ్డికి అందజేశారు. శనివారం మండలంలోని వెలిగండ్ల ఎంఈఓ కార్యాలయం 2కి బీరువాను దుర్గంపూడి రామిరెడ్డి విశ్రాంతి ఉపాధ్యాయులు, గొరిగి వెంకట ప్రసాద్ బల్లను, తిరిగే కుర్చీ దేవి రెడ్డి రామిరెడ్డి విశ్రాంతి ఉపాధ్యాయులు ఎంఈఓ .2కి అందజేశారు. దాతలను సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవాచారి, ఎం శ్రీనివాసులు, హరిబాబు, సైకం శ్రీనివాసరెడ్డి, గజ్జల తిరుపతిరెడ్డి, మాల్యాద్రి, నారపరెడ్డి వెంకటరెడ్డి ,చల్లా సత్యనారాయణ, నారాయణరెడ్డి ,రత్తయ్య, హరి కేశవ తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమం

- రాజ్యసభ సభ్యులు బాబు బాయ్ దేశాయ్

విశాలాంధ్ర - వేమూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పేట వేసిందని రాజ్యసభ సభ్యులు బాబు బాయ్ దేశాయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన వేమూరులో వికసితభారత్ ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎంపీడీవో అనురాధ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే దిశగా వికసిత భారత యాత్ర కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ కనెక్షన్లను,ఆరోగ్య సంక్షేమ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్, ప్రధాన కార్యదర్శి మండల రామకృష్ణ, సుగుణ గణేష్ బాబు, వెలివేల సాంబశివరావు,గల్లా కోటేశ్వరరావు, జనార్ధన శాస్త్రి, ప్రభాకర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు చర్యలు

విశాలాంధ్ర-దర్శి : దర్శి నగరపంచాయతీ పరిధిలో కోతులు బెడద తీవ్రమైంది. నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు ప్రత్యంగా కోతులను పట్టు కోనేవారిని పిలిపించి మూడు విడతలుగా 600కోతులను పట్టించారు. ఒక కోతికి రూ.600 చెల్లించామన్నారు.నగర పంచాయితీ పరిధిలోని 20వార్డులోని ప్రజలు సమాచారం ఇవ్వాలని అన్నారు.

బాబు సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

విశాలాంధ్ర- హనుమంతునిపాడు : ఈ నెల 5వ తేదీన కనిగిరి పట్టణం లోనే జరిగిన "రా కదలిరా" ఎన్నికల సమర శంఖారావం బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గం నుండి ఖ హనుమంతునిపాడు మండల నుండి ఎంతో కష్టించి వేలాదిగా తరలివచ్చి బహిరంగ సభను దిగ్విజయం చేసిన కనిగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు , హనుమంతునిపాడు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానుల ప్రజలకు పేరుపేరునా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

దామచర్లను కలిసిన శ్యామల కాశిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ చంద్రబాబు ఎన్నికల సభ జరిగిన క్రమంలో శనివారం శ్యామల అతిథి గృహం నందు బసచేసిన దామచర్ల జనార్ధన్‌ను వెలిగండ్ల టిడిపి మాజీ మండల అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి మర్యాదపూర్వకంగా వారిని కలిశారు. కలిసిన వారిలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు, కోటపాటి జనార్ధన్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు ఈ కార్యక్రమంలో టిడిపి వెలిగండ్ల మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటు

విశాలాంధ్ర- టంగుటూరు: 26రోజుల నుండి అంగన్‌వాడీలు తమన్యాయమైన డిమాండ్‌ల కోసం నిరసన చేస్తున్న వారిపై ఈరోజు రాష్ట్రప్రభుత్వం ఎస్మా ప్రయోగించిదింది, టంగుటూరులో స్థానిక ఐసిడియస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసనకు జనవిజ్ఞానవేదిక నాయకులు కోటపాటి నారాయణ,టి.రామ్మూర్తి, టి.నారాయణరావులు పాల్గొని మద్దతు తెలిపారు. జనవిజ్ఞాన నాయకులు మాట్లాడుతూ ఇన్నిరోజుల నుండి నిరసన తెలుపుతున్న అంగాన్‌వాడీలను అభినందించారు.ఎమర్జెన్సీ కాలం నాటి నల్లచట్టాలను వారిపై ప్రమోగించడం, ప్రభుత్వం యొక్క హేయమైనచర్యను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాము, కెవిపియస్‌నాయకులు వి.మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.శేషమ్మ, పి.క్రాంతి, సుభాషిణి, పచ్చవ శ్రీదేవి,కె. హెమలత,బి.జ్యోతి,వై.విజయ,రత్నకుమారి,లలిత ,ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర- టంగుటూరు: టంగుటూరు టోల్‌గేట్ వద్ద శనివారం ఉదయం కర్ణాటక రాష్ట్రానికి చెందిన 15 మద్యం ఫుల్‌బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని టంగుటూరు యస్ఐ ఖాధర్‌భాషా తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సింగరాయకొండ సిఐ డి.రంగనాథ్ ఆధ్వర్యంలో టంగుటూరు యస్ఐ యస్‌కె. ఖాధర్‌భాషా, సింగరాయకొండ యస్ఐ శ్రీరామ్, సెబ్ అధికారులు మరియు సిబ్బంది కలసి టంగుటూరు టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీచేసామన్నారు. బెంగుళూరు నుండి రేపల్లే వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చేయగా చెరువు జమ్ములపాలెం గ్రామం, బాపట్ల జిల్లా వాసి వద్దనుండి వివిధరకాల 15 మద్యం ఫుల్‌బాటిళ్లు కర్ణాటక రాష్ట్రానికి చెందినవి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యం రవాణా చేస్తున్నందున అతనిని అదుపులోకి తీసుకుని, టంగుటూరు పోలీసు స్టేషన్ లో కేసు నమోదచేసి కోర్టులు హాజరు పరచనున్నట్లు యస్ఐ యస్‌కె. ఖాధర్‌భాషా తెలియజేసారు.

చంద్రబాబుతో గోన ప్రతాప్

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కనిగిరి మాజీ శాసనసభ్యులు టిడిపి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అన్న కాంటీన్ ప్రారంభించిన సంగతి విధితమే. చంద్రబాబు కనిగిరికి వచ్చి స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ను శనివారం సందర్శించి పేదలకు అన్నం వడ్డిస్తున్న క్రమంలో గోన ప్రతాప్ తెలుగుదేశం కార్యకర్తలు వారి వెంట ఉన్నారు.

వైయస్సార్ పింఛన్ కానుక సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర- టంగుటూరు: వై.యస్.ఆర్. పెన్షన్ కానుక పెంపుదల కార్యక్రమం 8వతేది సోమవారం ఉదయం పది గంటలకు స్థానిక టంగుటూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగునని, ఎంపిడీవో వసంతలక్ష్మి పత్రికా ప్రకటనలో తెలియజేసారు. రాష్ట్రప్రభుత్వము ప్రస్తుతము పెన్షన్ రూ.2750. నుండి రూ.3000.లకు పెంపుదల చేయడం జరిగిందని తెలియజేసారు. పెంపుదల పెన్షన్ లతో పాటు కొత్తపెన్షన్‌దారులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా పంపిణీ చేస్తారని తెలిపారు. మండలంలోని మండలస్థాయి అధికారులు, సర్పంచులు,ఎంపీటీసీలు,పింఛన్‌దారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఈ నెల 5వ తేదీన కనిగిరి పట్టణంలోనే జరిగిన మన ప్రియతమ అధినేత చంద్రబాబు నాయుడు విచ్చేసిన "రా కదలిరా" ఎన్నికల సమర శంఖారావం బహిరంగ సభకు బహిరంగ సభను దిగ్విజయం చేసిన కార్యకర్తలు,అభిమానుల ప్రజలకు టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి రంగ సాయి యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ కార్యకర్త చీకటి బాలమ్మ మృతి

విశాలాంధ్ర- హనుమంతునిపాడు : మండల పరిధిలోని నందనవనం పంచాయితీ నందు పాపిరెడ్డిపల్లి గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మరియు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకటసుబ్బయ్య తల్లి చీకటి బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే హనుమంతునిపాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని చీకటి బాలమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి,కందుల వెంకట సుబ్బారెడ్డి,దేవిరెడ్డి రాజా రామిరెడ్డి,కూరాకు బాల నారాయణ యాదవ్,పెంచికల రామకృష్ణ, తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణం

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నన్నూరి సీతారామ్ చౌదరి

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వము ఎస్మా చట్టాన్ని, అంగన్వాడీల ఉద్యమం పైన ఉపయోగించటం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నన్నూరి సీతారామ్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వము జారీ చేసిన జీవోను వెంటనే ఉప సంహరించుకోవాలని,కనీస పనికి , కనీస వేతనం అనే నినాదంతో, అంగన్వాడీ వర్కర్స్ గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలను గానీ, అందులో పని చేసేటువంటి కార్యకర్తల, సంక్షేమం ఏరోజు కూడా ఆలోచన చేయలేదన్నారు. తక్షణమే అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ కార్యకర్తలకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఐదవ తారీఖున కనిగిరి పట్టణంలోనే జరిగిన మన ప్రియతమ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విచ్చేసిన "రా కదలిరా" ఎన్నికల సమర శంఖారావం బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గం నుండి మరియు హనుమంతు నిపాడు మండల నుండి ఎంతో కష్టించి వేలాదిగా తరలివచ్చి బహిరంగ సభను దిగ్విజయం చేసిన కనిగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు మరియు హనుమంతునిపాడు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానుల ప్రజలకు పేరుపేరునా టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : పాడు పడిపోయిన ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు అనే పథకం ద్వారా ప్రక్షాళన చేసి ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి తెచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి తెలిపారు.మండల పరిధిలోని నందనవనం హై స్కూల్ నందు శనివారం విద్యార్థులకు ఉచిత ట్యాబులను నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మౌలిక సదుపాయాల నమోదు

విశాలాంధ్ర-పర్చూరు: పాఠశాలల మౌలిక సదుపాయాల వివరాలను నమోదు చేయాలని విద్యాశాఖ జిల్లా అధికారి రామారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విద్యాశాఖపై నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పథకం ద్వారా నిర్మాణం జరుగుతున్న పాఠశాలల్లో పురోగతిపై వివరాలను నివేదిక రూపంలో తీసుకున్నారు. సీబీఎస్ అమలవుతున్న విధానంను అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల ఉపవిద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసులు, ఆరు మండలాల విద్యాధికారులు, పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

వృద్ధులకు నూతన పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : వృద్ధులకు నూతనంగా మంజూరైన పేన్షన్ను ప్రసాద్కి వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వృద్ధుడను ఆదుకునేందుకు పెన్షన్ను అందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ కార్యక్రమాన్ని వైసిపి అందిస్తుందని అన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-సీఎస్పురం : సీఎస్పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా మూడోవ రోజు కోవిలంపాడు గ్రామంలోని ప్రజలకు ఉచితంగా ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, కోవిలంపాడు సర్పంచ్ షేక్ బుజ్జి ప్రారంభించారు.

ఎన్.ఎస్. ఎస్ ఇంచార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు,సర్పంచ్ షేక్ బుజ్జి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిర ఉత్సవాలను రాజకీయాలకు అన్వయించుకోవడం తగదు

- సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించి లబ్ధి పొందాలనుకోవడం లౌకిక రాజ్యాంగానికి విరుద్ధం
- సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి
- ఎంపిజె రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : అయోధ్యలో రామ మందిరానికి సంబంధించిన ప్రతిపాదిత ఉత్సవాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు దేశానికి ఆందోళన కలిగించే విషయం. సార్వత్రిక ఎన్నికలకు ముందు దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్న తీరు, వారికి పెద్ద ఎత్తున ప్రభుత్వ మన్ననలు అందజేస్తున్న తీరు దేశానికే కాదు, లౌకిక రాజ్యాంగానికి విరుద్ధమే కాదు, న్యాయమైన ఎన్నికల స్ఫూర్తికి కూడా విరుద్ధం. బాబ్రీ మస్జిదుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సంతృప్తి చెందక పోయిన ఒక వర్గం గౌరవించిన సంగతి మరవకూడదు. ఆలయాన్ని కూల్చివేసి బాబ్రీ మసీదును నిర్మించినట్లు ఆధారాలు లేవని, బాబ్రీ మసీదు తాళం పగల గొట్టి అందులో విగ్రహాలను ఉంచి, కూల్చి వేయడం నేరపూరిత చర్యలేనని కోర్టు అంగీకరించింది. ఈ విషయాలను అంగీకరిస్తూ, న్యాయస్థానం కేవలం విశ్వాసం ఆధారంగా బాబ్రీ మసీదు స్థలాన్ని ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చారనే విషయం మరవకూడదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఒక ధార్మిక కార్యక్రమంలాగా చూడాలే కాని రాజకీయాలు చేయాలని అనుకోవడం దేశ లౌకికత్వానికి నష్టదాయకం. ఈ వైఖరి న్యాయ వ్యవస్థపై, దేశంలోని న్యాయమైన మనస్తత్వం ఉన్న ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి దారితీస్తుంది. ఈ పరిస్థితులలో దేశంలో శాంతి , శాంతిభద్రతల పరిరక్షణకు సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలని యంపిజె దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుంది. ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్న, ఈ పరిస్థితులతో నిరుత్సాహ పడకుండా, సహనం కోల్పోకుండా ఉండాలి. సోషల్ మీడియాలో అనుచితమైన చర్చలు మరియు ఉద్రేకపూరిత వీడియోలు లేదా కంటెంట్ను ఫార్వార్డ్ చేయడాన్ని కచ్చితంగా నివారించి, మతోన్మాదులు పరిస్థితిని దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే అని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని దోర్నాల మండల బిజెపి అధ్యక్షుడు సూరవరం గండి వీరారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బొమ్మలాపురం, బోడే నాయక్ తాండా గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నాసర్రెడ్డి అధ్యక్షతన సంకల్పయాత్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు ఎంపీడీవో నాసర్రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల రావు బిజెపి మండల అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఎనుముల నాగేశ్వరరావు ,బిజెపి నాయకులు, అధికారులు మాట్లాడుతూ మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత్ సంకల్ప యాత్రతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు అవుతున్న పథకాల గురించి ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ప్రధానమంత్రి వాసు యోజన పథకం ద్వారా ప్రతి ఒక్క గృహ లబ్దిదారులకు గృహ నిర్మాణానికి లక్ష యాభై వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా పిఎం కిసాన్ ద్వారా రైతులకు సంవత్సరానికి 6000 రూపాయలు అందిస్తుందని, ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా ప్రతి ఒక్కరికి సంవత్సరానికి 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి, జవహర్లాల్ నాయక్, ఎంఈఓ మస్తాన్ నాయక్, ఉపాధి పథకం ఏపీఓ అన్నపూర్ణ, పశు వైద్యాధికారి డాక్టర్ ఆదిమూలపు అరుణ్ , చింతల వైద్యాధికారి డాక్టర్ సాయి ప్రశాంతి, ఆర్డబ్ల్యూసీ ఏఈ భ్రమరాంకదేవి బిజెపి నాయకులు, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకుడు బొచ్చు మల్లారెడ్డి, వెన్న అల్లు రెడ్డి, ఈ సంకల్ప యాత్రకు మండలంలోని అధికారులు పాల్గొన్నారు.

'దిగువ మెట్ట'లో వికసిత భారత్ సంకల్పయాత్ర

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని దిగువ మెట్ట గ్రామంలో జరిగిన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా కార్య వర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్, గిద్దలూరు అసెంబ్లీ ఎస్సీ మోర్చ ఇంఛార్జి బందారు జయ ప్రసాద్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ భరత దేశం ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే విధంగా అనేక కేంద్ర ప్రభుత్వం పద కాలు ప్రారంభించడం జరిగింది అని వాటి వల్ల లబ్ధి దారులు,అర్హులు అయి లబ్ధి పొందని వారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పద కాలు వినియోగించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభించిన విశ్వకర్మ కౌసల్య యోజన పదకం ద్వారా 18 రకాల చేతి వృత్తులు చేసే వారు అర్హులు మీసేవ ద్వారా అప్లయ్ చేసుకోవాలి అని తరువాత 15 రోజులు ట్రైనింగ్ ఉంటుంది అని ట్రైనింగ్లో రోజుకు ప్రతి ఒక్కరికీ 500 ఇస్తారు. పరికరాల కొనుగోలుకు 15000 ఇస్తారని తరువాత బ్యాంక్ వారికి బ్యాంక్ లోన్ సౌకర్యం 1.00.000 ఇస్తారు. 5 పర్సెంట్ ఇంట్రెస్ట్ ఉంటుంది, కావున అర్హులు అందరూ తప్పకుండా వినియోగించు కావాలని కోరారు.

ఘనంగా క్రిత్విక్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ఉన్న పవిత్ర ఫంక్షన్ హాల్ నందు కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఉన్న హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ మరియు దద్దాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దద్దాల నారాయణ , వెలిగండ్ల మండల పరిధిలోని హుస్సేన్ పురం సర్పంచ్ దద్దాల మంజు భార్గవి కుమారుడు దద్దాల జ్ఞాన్ క్రిత్విక్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ వేడుకలలో జబర్దస్ట్ కమెడియన్స్ తో ప్రోగ్రాంతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైయస్సార్సీపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,శ్రేయోభిలాషులు మరియు తదితరులు పాల్గొని దద్దాల కుమారుడిని క్రిత్విక్ యాదవ్ ను అక్షింతలతో ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ కార్యకర్తలకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఈ నెల ఐదో తేదీన కనిగిరి పట్టణంలోనే జరిగిన మన ప్రియతమ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విచ్చేసిన "రా కదలిరా" ఎన్నికల సమర శంఖారావం బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గం నుండి మరియు హనుమంతు నిపాడు మండల నుండి ఎంతో కష్టించి వేలాదిగా తరలి వచ్చి బహిరంగ సభను దిగ్విజయం చేసిన కనిగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులకు మరియు హనుమంతు నిపాడు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ప్రజలకు పేరుపేరునా టీడీపీ నాయకులు గంటా శ్రీనివాసులు రెడ్డి (రైల్వే కాంట్రాక్టర్) (బెంగుళూరు) ధన్యవాదాలు తెలియజేశారు.

రాజబాబుకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర-మార్కాపురం : జార్జి ఇంజనీరింగ్ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ చిలకపాటి రాజబాబు ఫిలాసఫీ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో రీసెర్చ్ చేసినందుకు శనివారం డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. అనంతపు రంలోని జెఎన్టీ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవం కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అయన ఈ అవార్డును అందుకున్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తాటిపర్తి

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఎర్రగొండపాలెం నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా నియమితులైన తాటిపర్తి చం ద్రేశేఖర్ ప్రకాశం జిల్లా మెజిస్ట్రేట్ కలెక్టర్ దినేష్ కుమార్ ను శనివారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎర్రగొండపాలెం నియోజక వర్గంలోని నీటి సరఫరా బిల్లులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు పట్ల సహకరించాలని కోరడం జరిగింది.

టీడీపీలో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్న మస్తాన్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ చిన్న మస్తాన్ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. శుక్రవారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు తెదేపా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. శనివారం అన్న క్యాంటీన్ వార్షికోత్సవ వేడుకల్లో చిన్న మస్తాన్ పాల్గొని చంద్రబాబు నాయుడుతో ఫోటో సెక్షన్ లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

'పొన్నూరు'కి పూర్ణకుంభ పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు రాజమండ్రిలో ఈ నెల 5,6,7 తేదీలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు భాష ఉత్సవాల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం గత 60 సంవత్సరాలుగా జిల్లాలో తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నందుకు సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుకు పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హైకోర్టు జస్టిస్ డి.కృష్ణమోహన్, ఆంధ్రరాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ చైతన్యరాజు తదితరులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహాసభలలో ఆదికవి నన్నయ్య వేదికపై ప్రముఖ తెలుగు వాగ్గేయకారుడు రామదాసుపై పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రకాశం రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, సంఘ సభ్యులు మూడమంచు వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్స్ దుకాణం యజమాని నిజాయితీ

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలోని ఓ సెల్ ఫోన్ దుకాణం యజమాని తన నిజాయితీ చాటుకున్నాడు. కిరణ్ మొబైల్స్ యజమాని గోకుల కిరణ్ కు శనివారం తన దుకాణం సమీపంలో తొమ్మిది వేల రూపాయల నగదు దొరికింది. ఇది ఎవరిదని ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో కిరణ్ చీరాల 1టౌన్ సిఐ శేషగిరిరావుకు ఆ నగదును అందజేశారు. ఆ నగదు పోగొట్టుకున్న వారు వస్తే అందజేస్తామని చెప్పారు. పరాయి సొమ్మును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన కిరణ్‌ను సీఐ శేషగిరిరావు అభినందించారు.

అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలు

- దర్శిలో వారం రోజులు ముందే సంక్రాంతిసంబరాలు
- పోటీలు ప్రారంభించిన గరికపాటి వెంకట్

విశాలాంధ్ర-దర్శి : దర్శిలో జనసేన నాయకులు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన అటహాసంగా శనివారం ప్రారంభమయ్యాయి. నాలుగు పళ్ళ విభాగంలో శనివారం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 38జతలు ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను దర్శి జనసేన నాయకులు గరికపాటి వెంకట్, ఇన్చార్జి బోటుకు రమేష్, జనసేన రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ దర్శి మాజీ ఎమ్మెల్యే కుమారుడు జనసేన నాయకులు దిరిశల యేసు రెడ్డి ప్రారంభించారు. పోటీలు సందర్భంగా దర్శి పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అద్దంకి దర్శి రోడ్డులో భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామంలో ఎడ్ల బల ప్రదర్శనకు సంబంధించిన ఫ్లెక్సీ లు ఏర్పాటు చేశారు. ఎడ్ల బల ప్రదర్శను తిలకించడానికి వచ్చే ప్రేక్షకులు కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటులు చేశారు. ప్రాంగణంలో భారీ ఎల్. ఈ డి స్క్రీన్‌లును ఏర్పాటు చేశారు. నియోజకవర్గం తో పాటు పలు జిల్లాలు నుండి పోటీలను తిలకించేందుకు రైతన్న లు వచ్చారు. ప్రాంగణం అంత టిడిపి, జనసేన, ఫ్లెక్సీ లు, జెండాలను ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించటానికి వచ్చిన మహిళా లకు ప్రత్యేక గ్యాలరీ ని ఏర్పాటు చేశారు. దర్శి కి వారం రోజులు ముందే సంక్రాంతి పండుగ వచ్చిందని అన్నదాతలు అంటున్నారు. పోటి ప్రారంభించిన వారిలో జనసేన నాయకులు బోటుకు రమేష్ బాబు, చాటారసి కొండయ్య, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

- మోకాళ్లపై నిలబడి నిరసన
- మద్దతుగా నిలిచిన ఏఐటీయూసీ

విశాలాంధ్ర-దర్శి : దర్శిలో మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. శనివారం వినూత్నంగా మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడి దాసు మాట్లాడుతూ 13 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలుస్తున్న కానీ ప్రిన్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు లేవని ఆయన విమర్శించారు. కరోనా కష్టకాలంలో చావులు సైతం ఎదిరించి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడటం ఈ ప్రభుత్వానికి ఏమాత్రం మంచి పద్ధతి కాదని ఆయన దుయ్యబట్టారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ బందెల రవి మాట్లాడుతూ తన పాదయాత్రలో నేను విన్నాను నేను ఉన్నాను అని చెప్పి ఈరోజు మున్సిపల్ కార్మికుల సమస్యలు ఎందుకు వినటం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆంధ్రప్రదేశ్ ను ఉద్యమాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సమ్మెకు జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య, సిఐటియు నాయకులు తాండవ రంగారావు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల వర్కర్ సీనియర్ నాయకులు ఇర్మియా, ఇత్తడి ప్రభాకర్, పుల్లయ్య, విజయ్, శ్రీకాంత్, నవీన్ అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలు అన్ని వెంటనే చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ లు వెంటనే తీర్చాలని ఏపీటీఎఫ్ సిఎస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేయస్ ఆనంద్, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం సిఎస్ పురం మెయిన్ స్కూల్లో ఏపీటీఎఫ్ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ 11వ తేదీ విజయవాడలో జరగనున్న కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరరావు ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఫిబ్రవరి నెలలో టాక్స్ ఫారాలు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో సి పి యస్ రద్దు చేయాలని, ఐ ఆర్ ప్రకటించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మండల ఏపీటీఎఫ్ నాయకులు బి రవీంద్ర, చంద్రశేఖర్, కే చెన్నయ్య, డి సుబ్బరాయుడు, డి పున్నమ్మ, ఎలిజబెత్, మహేశ్వరి, జీ రామకృష్ణ, వహీద్, చిన్న నారాయణ, పుల్లయ్య, హామద్, ఏలికా శ్రీను, గాలి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ రకాల సంబరాల పోటీలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా మార్కాపురం వాసవి క్లబ్ వారి ఆర్థిక సౌజన్యంతో బహుమతి ప్రధానం చేసేందుకు ముందుకు రావడం విశేషం. దీంతో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అందులో ముఖ్యంగా ముగ్గుల పోటీలు, హరిదాసుల వేషధారణ, అష్టలక్ష్మి అమ్మవారివేషధారణ, సైన్స్ పరమైనటువంటి చిత్రాలు, అచ్చం పల్లెటూరి వాతావరణం కళ్లకు కట్టినట్లుగా వేషధారణ వేసి పాఠశాలలో ప్రదర్శించడం చూపరులకు కనువిందులు కలిగించారు. గెలుపొందిన విజేతలకు వాసవి క్లబ్ సభ్యులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్‌ల చేతుల మీదుగా బహుమ తుల ప్రధానం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పోకా నాయుడు



విశాలాంధ్ర-కనిగిరి : పట్టణంలోని కనిగిరి టీడీపీ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రకాశం జిల్లా టీఎన్ఎస్వి మాజీ కార్యదర్శి పోకనాయుడు కలిసి తమ గ్రామంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులను వివరించారు. శుక్రవారం ఎన్నికల శంఖారావం పూరించేందుకు కనిగిరికి విచ్చేసిన చంద్రబాబు నాయుడు శుక్రవారం రాత్రి కార్యకర్తలలో జోష్ వచ్చే విధంగా అందరిని పలకరిస్తూ, పరిచయ కార్యక్రమం నిర్వహించారు.